RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in  rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారీగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 317 | 08 గురువారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## అమరావతి నిర్మాణంలో ఐక్యరాజ్యసమితి భాగస్వామ్యం



**అమరావతి, రాజధాని వాయిస్ అక్టోబర్ 7 :** రాజధాని అమరావతి నిర్మాణంలో ఏపీతో కలిసి పనిచేసేందుకు ఐక్యరాజ్యసమితి ముందుకొచ్చింది. రాయపూడిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో అర్బన్ ఇన్నోవేషన్ అండ్ సస్టెయినబిలిటీ (యూఆర్‌బీఐఎస్) సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. మంత్రి నారాయణ సమక్షంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ విభాగాలు, నిపుణులతో కలిసి యూఆర్‌బీఐఎస్ పనిచేయనుంది. అమరావతి నిర్మాణంతో పాటు గృహ నిర్మాణం, మురికివా డల అభివృద్ధి, పట్టణ ప్రణాళిక, తుపానులను సమర్థంగా ఎదుర్కోవడం, మెరుగైన పట్టణ సేవలు అందించడంలో యూఆర్‌బీఐఎస్ సహకరించనుంది.

## స్థానిక ఎన్నికలపై వైకాపా పిటిషన్.. సుప్రీంలో కేవియట్ దాఖలు చేసిన ఏపీ ప్రభుత్వం



**దిల్లీ, అక్టోబర్ 7 :** స్థానిక సంస్థల ఎన్నికలు నిలుపుదల చేయాలని కోరుతూ వైకాపా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ ముగియకుండానే స్థానిక ఎన్నికలకు సిద్ధమయ్యారని అందులో పేర్కొంది. ఏ క్షణంలో అయినా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని, వెంటనే విచారణ చేపట్టాలని వైకాపా తరఫు న్యాయవాది కోరారు. 'సర్' ప్రక్రియ మొత్తం ముగిసిన తర్వాతే.. స్థానిక ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ... వైకాపా దాఖలు చేసిన పిటిషన్‌లో తమ వాదనలు విన్న తర్వాతే తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ దాఖలు చేసింది. ఏపీలో స్థానిక ఎన్నికలపై రాష్ట్ర హైకోర్టు ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. ఎన్నికల ప్రక్రియను ఆరు వారాల్లోపు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలతో ముడిపడి ఉన్న వ్యాజ్యాలపై ఆదేశాలు జారీ చేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని పేర్కొంది. 'సర్' ప్రక్రియ ముగిశాకే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైకాపా దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు వార్డుల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో వైకాపా సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ.. జీహెచ్‌హెచ్ ప్రాజెక్టుపై చర్చ



ఢిల్లీ : ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును మరింత ముందుకు తీసుకెళ్లే అంశంపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు, ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ రంగాలను మరింత అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు అమలులో భాగంగా జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణ, అవసరమైన ప్రణాళికలు, సంబంధిత శాఖల సమన్వయంపై సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రితో చర్చించారు.ఇటీవల గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై, ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యాన రంగానికి మరింత ఊతమిచ్చే ఈ ప్రాజెక్టు విజయవంతంగా అమలు కావడానికి కేంద్ర సహకారం అవసరమని సీఎం వివరించినట్లు సమాచారం.అలాగే ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల అంశంపైనా ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు, కేంద్ర సహకారం, ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన అంశాలను సీఎం కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రాధాన్యతలను కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్లే దిశగా సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో వరుసగా కేంద్ర మంత్రులతో సమావేశమవుతున్నారు. ఇందులో భాగం గానే నిర్మలా సీతారామన్‌తో జరిగిన భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుపాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల కట్టడికి.. త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్: లోకేశ్



**అమరావతి, రాజధాని వాయిస్ అక్టోబర్ 7 :** ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి, మాదక ద్రవ్యాల కట్టడికి పొరుగు రాష్ట్రాలతో సమన్వయం పెంచేలా విశాఖపట్నంలో త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించనున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. సింథటిక్ డ్రగ్స్ కట్టడికి పంజాబ్ పోలీసులు అమలు చేస్తున్న విధానాలపై అధ్యయనం చేయడంతో పాటు.. గంజాయి చాక్లెట్లు, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణకు రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటుపైనా అధ్యయనం చేయనున్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి లోకేశ్ సూచించారు.రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణకు మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. డ్రగ్స్ వద్దు బ్రో, ఆపరేషన్ చైతన్యం వంటి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతంగా నిర్వహించాలని లోకేశ్.. అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేసినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గంజాయి రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని.. డ్రోన్ నిఘాను మరింత విస్తృతం చేశామని చెప్పారు. విశాఖపట్నం, నరసరావుపేటలో ఇటీవల పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బిహార్, యూపీ నుంచి తీసుకొచ్చినట్లు గుర్తించామని ఈగల్ ఐజీ రవికృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని ఆయా రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అప్రమత్తం చేసినట్లు చెప్పారు.

## ప్రతి అనుభవం పాఠమే!

### ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : ప్రజల విశ్వాసంతోనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల నిరంతర ప్రస్థానం సాధ్యపడిందని, తన జీవితంలో ప్రతి అనుభవాన్ని ఒక పాఠంగా స్వీకరించానని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. గుజరాత్ ముఖ్యమం త్రిగా ఆయన తొలిసారి 2001 అక్టోబర్ 7న పదవీ స్వీకార ప్రమాణం చేసి పలు పర్యాయాలు ముఖ్యమంత్రిగానూ, అనం తరం 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడు పర్యాయాలుగా ఆ పదవిలో కొనసాగుతున్నారు. ముఖ్యమం త్రిగా, ప్రధానిగా ఈ 25 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా బుధవారం నాడు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో ఆయన ప్రసంగించారు. ప్రజల ఆశీస్సు లే తనను ఇంతకాలం నడిపించాయని, గుజరాత్ సిఎంగా ప్రమాణం చేసినప్పుడు.. 25 ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ అందిస్తానని ఊహించలేదన్నారు. ప్రజా సేవలో ఉన్నప్పుడు విమర్శలు వస్తూనే ఉంటాయని, వాటిని పట్టించుకుంటే.. ముందుకు వెళ్లలేమన్నారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించి తీరుతామన్నారు. ఆత్మనిర్భర్ భారత్, గ్లోబల్ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్ సాధ్యమేనని, అంతరిక్షంలో అడుగుపెట్టడం, ఒలింపిక్స్ నిర్వహణ.. ఇలాంటివన్నీ సాధ్యమేన ని, ప్రపంచ మంతా ఇప్పుడు భారత్ వైపు చూస్తోం దని గొప్పలు చెప్పారు. తన జీవితంలో ఎదురైన ప్రతి వ్యక్తి, ప్రతి సంఘటన ఏదో ఒక విషయాన్ని నేర్పిందన్నారు. ప్రతి అనుభవాన్ని ఒక పాఠంగా స్వీకరించానని, తాను నిత్య విద్యార్థినని మోడీ చెప్పుకొచ్చారు. అంతుకు ముందు 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలోని సరొజినీ నగర్‌లో ఉన్న వినాయక మందిరంలో ప్రధాని మోడీ ప్రత్యేక పూజలు చేశారు. బిజెపి కురువృద్ధుడు ఎల్‌కె అద్వానీతోనూ మోడీ సమావేశమై ఆయన ఆశ్సీసులు పొందారు. కాగా 25 ఏళ్ల సుదీర్ఘకాలం ప్రజాసే వలో కొనసాగిన ప్రధాని మోడీకి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె సామాజిక మాధ్యమాల్లో పేర్కొనగా..ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

## విశాఖలో సీఐఐ సదస్సు.. 25 సంస్థలతో ఒప్పందాలు




**విశాఖపట్నం, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. టెక్నాలజీ అండ్ డీప్ టెక్ నినాదంతో విశాఖ ఐఐఎంలో జరిగి న సీఐఐ ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులో.. 19వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిం చేలా 25 సంస్థలతో ఒప్పందాలు జరిగాయి. 500 మందికి పైగా పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ సదస్సుకు రామ్మోహన్ నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి,ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, సీఐఐ, ఐఐఎం ప్రతినిధులు, మూడు జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర కేంద్రంగా ఆర్థిక ప్రగతిపై సదస్సులో చర్చించారు. కూటమి పాలనలో ఉత్తరాంధ్రలో విస్తృతంగా అభివృద్ధి జరుగుతోందని రామ్మోహన్ నాయుడు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్తమ విధానాల వల్లే ఏపీకి పెట్టుబడులు క్యూ కడుతున్నాయని చెప్పారు. సమర్థ నాయకత్వం వల్ల రెండేళ్లలోనే ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా ఏపీ మారిందన్నారు.

### సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాయకులపై ఉంది: నటుడు ప్రకాశ్‌రాజ్



చెన్నై **రాజధాని వాయిస్** : ప్రజల తరఫున మీడియా లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులైన నాయకులకు ఉందని నటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. చెన్నైలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ... తాను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడిని కాదన్నారు. ప్రజా సంక్షేమానికి సంబంధించిన రాజకీయాల్లో మాత్రం దృఢంగా ఉన్నానని తెలిపారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు పాలన చేస్తున్నారని, అదే సమయంలో పౌరులూ రాజకీయాల్లో పాల్గొనాలని రాజ్యాంగం చెబుతోందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులైన రాజకీయ నాయకులు మీడియా ప్రతినిధులను కలిసేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి తదితర ఎన్నికైన నాయకులకు ప్రజల తరఫున మీడియా లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ్యత ఉందన్నారు. 'సర్'లో లోపాలు ఉన్నాయని ఆరోపించారు. సిబ్బంది వచ్చినప్పుడు.. ఓటర్లు ఇంటి వద్ద లేకపోతే వారి పేర్లనూ తొలగించారని విమర్శించారు. లక్షలాది మంది తమ ఓటు హక్కును కోల్పోయారని, ఇది సంఖ్యకు సంబంధించిన విషయం కాదని, పౌరుడి హక్కుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. గతంలో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను నమోదు చేసేవారని, ఇప్పుడు దానికి భిన్నంగా ఓటర్లే ఫారాలను నింపుతున్నారని విమర్శించారు.

## గోదావరి డెల్టా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం: మంత్రి



**అమరావతి, రాజధాని వాయిస్ :** గోదావరి డెల్టా ప్రాంతంలో ప్రతి ఏడాది ఎదురవుతున్న ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతి లోని తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు, సాంకేతిక నిపుణులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహిం చారు. డెల్టా ప్రాంతాల అభివృద్ధి, వరదల నివారణ, నీటి పారుదల వ్యవస్థ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.13 కోట్ల 40 లక్షల వ్యయంతో అత్యాధునిక లైడార్ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సర్వే ఆధారంగా గోదావరి డెల్టా ప్రాంతానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ముంపు సమస్యలను శాశ్వతంగా నివారించేందుకు అవసరమైన అన్ని సాంకేతిక అంశాలను నివేదికలో పొందుపరుస్తున్నట్లు వివరించారు. తూర్పు డెల్టా ఆధునీకరణ కోసం రూ.1,137 కోట్లతో, సెంట్రల్ డెల్టా అభివృద్ధి కోసం రూ.1,268 కోట్లతో ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. పశ్చిమ డెల్టాకు సంబంధించిన అంచనాలను కూడా త్వరితగతిన పూర్తి చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. డెల్టా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కాలువలు, డ్రెయిన్లు, బండ్ల బలోపేతం, పూడికతీత పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లాకులు, షట్టర్ల ఆధునీకరణ ద్వారా వరద నీటి నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయాలని సూచించారు.ప్రత్యేకించి సముద్రంలో కలిసే ప్రధాన డ్రెయిన్ల వద్ద పేరుకుపోయిన పూడిక తొలగింపుపై దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు. ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, నరసాపురం, భీమవరం ప్రాంతాల్లోని సీ మౌత్‌ల వద్ద డ్రెడ్జింగ్ చేపట్టేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. దీని ద్వారా వరద నీటి పారుదల సామర్థ్యం పెరిగి ముంపు ప్రమాదం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరిన లాకులు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపట్టాలని మంత్రి సూచించారు. గోదావరి డెల్టా ప్రాంతాన్ని ఆధునిక నీటి పారుదల వ్యవస్థతో అభివృద్ధి చేసి రైతులకు, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసులు

- మంచి స్పర్శ, చెడు స్పర్శపై వివరణ
- బాలల భద్రతపై సూచనలు
- పాఠశాలలో అవగాహన కార్యక్రమం
- నేరాల నివారణపై చైతన్యం




**నాయుడుపేట, రాజధాని వాయిస్** : నాయుడుపేట పోలీస్ స్టేషన్ ఉప పోలీసు అధికారి ఆధ్వర్యంలో మెనకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. బాలల భద్రత, వ్యక్తిగత రక్షణ, నేరాల నివారణ వంటి అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చిన్న వయస్సులోనే భద్రతపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాలను విద్యార్థులకు వివరించారు. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా బాధ్యతగల పెద్దలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.బాలలపై జరిగే వివిధ రకాల నేరాలు, వాటి ప్రభావాల గురించి కూడా అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టపరమైన రక్షణలు, సహాయ వ్యవస్థల గురించి కూడా విద్యార్థులకు వివరించారు. సామాజిక మాధ్యమాలు, పరిచయం లేని వ్యక్తులతో వ్యవహరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పెద్దల సహాయం తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, భద్రతపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. బాలల హక్కులు, రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన పెరగడం ద్వారా నేరాల నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆసక్తిగా కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించడం ద్వారా బాలల భద్రత మరింత బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు.

# కార్పొరేషన్ ఎన్నికలకు వైఎస్సార్సీపీ సన్నాహాలు



**నెల్లూరు, రాజధాని వాయిస్** : రానున్న కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్సీపీ నెల్లూరు నగర నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఈ క్రమంలో నెల్లూరులోని వైఎస్సార్సీపీ నగర కార్యాలయంలో 51వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమావేశమయ్యారు. డివిజన్‌లో పార్టీ పరిస్థితులు, ఎన్నికల వ్యూహాలు, కార్యకర్తల పాత్రపై ఆయన విస్తృతంగా చర్చించారు. సమావేశంలో డివిజన్‌కు సంబంధించిన పలు అంశాలపై కార్యకర్తల అభిప్రాయాలను ఎమ్మెల్సీ అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై సూచనలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో కార్యకర్తల సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాలని కోరారు. ప్రజా సమస్యలపై పార్టీ పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యత కల్పిస్తామని ఆయన తెలిపారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారికి అవకాశాలు కల్పించేలా చర్యలు ఉంటాయని వివరించారు. డివిజన్‌లో ఎవరికి టికెట్ కేటాయించినా అది పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే ఉంటుందని చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభిప్రాయాల కంటే పార్టీ విజయమే ముఖ్యమని పేర్కొంటూ రానున్న ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.

# జాతీయ పోషణ మాసం ముగింపు కార్యక్రమం



**కాకినాడ, రాజధాని వాయిస్** : 9వ జాతీయ పోషణ మాసం--2026 జిల్లా స్థాయి ముగింపు కార్యక్రమం కాకినాడ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పాల్గొని పోషకాహారం ప్రాధాన్యతపై మాట్లాడారు. మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో సమతుల్య పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కాలంలో ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.పోషకాహార లోపాన్ని తగ్గించడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. కుటుంబ స్థాయిలోనే పోషకాహారంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు పోషకాహారం ప్రాముఖ్యతను వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. స్థానికంగా లభించే పోషకాహార పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం అత్యంత అవసరమని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. పోషకాహార లోపం నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలకు అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించినందుకు కలెక్టర్ అభినందించారు. పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం కీలకమని పేర్కొన్నారు.

# డివిజన్ నాయకులతో ఎమ్మెల్సీ సమావేశం

- కార్పొరేషన్ ఎన్నికలపై చర్చ
- పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు
- కార్యకర్తలకు దిశానిర్దేశం
- అధిష్టానం నిర్ణయమే తుది నిర్ణయమన్న ఎమ్మెల్సీ



**నెల్లూరు, రాజధాని వాయిస్** : నెల్లూరు నగరంలోని 16వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్సీపీ సిటీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని ఎమ్మెల్సీ సూచించారు. ప్రజా సమస్యలపై పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ప్రజా సమస్యలపై పార్టీ తరఫున పోరాటాలు నిర్వహిస్తున్న కార్యకర్తలను ఎమ్మెల్సీ అభినందించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకుని పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనేక మంది ఆశావహులు ఉన్నప్పటికీ అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే జరుగుతుందని చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. టికెట్ల కేటాయింపులో పార్టీ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. క్రమశిక్షణతో వ్యవహరించాలని కోరారు. అభ్యర్థి ఎవరైనా పార్టీ విజయమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనపెట్టి అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యత నిర్వర్తించాలని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతా నికి ప్రజల మధ్య మరింత చురుకుగా పనిచేయాలని పిలుపుని చ్చారు. సమావేశంలో 16వ డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుడివాడ అభివృద్ధి పనులకు వేగం



**గుడివాడ, రాజధాని వాయిస్** : గుడివాడ పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతు లను నిర్ణీత సమయంలో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పట్టణంలోని తాగునీటి, రహదారుల పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, పైప్‌లైన్లు, వాటర్ వర్క్స్ పను లపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.బేతవోలు, నాగవరప్పాడు చెరువులకు సంబంధించిన పనులతో పాటు నీటి ట్యాంకులు, పైప్‌లైన్లు, రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు త్వరగా అందుబాటులోకి వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కొన్ని పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ఆలస్యానికి గల కారణాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచి పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.పట్టణ పరిధిలో గ్రామాల విలీనాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ లక్ష్యమని వెనిగండ్ల రాము పేర్కొన్నారు. తాగునీరు, రహదారులు వంటి ప్రాథమిక అవసరాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# అమరావతి భూ సమీకరణపై గ్రామసభ

- వాస్తవ విస్తీర్ణం మేరకే భూముల స్వీకరణ
- రైతులకు పత్రాల సమర్పణ సూచన
- వడ్డమానులో కలెక్టర్ సాయికాంత్ వర్మ స్పష్టీకరణ




**అమరావతి, రాజధాని వాయిస్** : అమరావతి రెండో విడత భూ సమీకరణ ప్రక్రియలో భాగంగా తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. భూ సమీకరణ ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని, రైతులు వాస్తవంగా కలిగి ఉన్న భూమి విస్తీర్ణాన్ని మాత్రమే సమీకరణలోకి తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల హక్కులు, ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామసభలో మాట్లాడిన కలెక్టర్, రీ సర్వే వివరాలు మరియు పట్టాదారు పాసుపుస్తకాల ఆధారంగా వాస్తవ భూవిస్తీర్ణాన్ని గుర్తించి సమీకరణ చేపడతామని పేర్కొన్నారు. భూముల కొలతల్లో ఎలాంటి సందేహాలు, అపోహలకు తావు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి రైతుకు సంబంధించిన భూమి వివరాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.డొంక రోడ్లు, ప్రభుత్వ భూములు లేదా ఇతర భూభాగాలు రైతుల భూములతో కలిసిన సందర్భాల్లో కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ భూమిని రైతుల భూమిగా పరిగణించే అవకాశం లేదని స్పష్టం చేశారు. రైతులు వాస్తవంగా సాగు చేస్తున్న లేదా రికార్డుల్లో నమోదైన భూమిని మాత్రమే సమీకరణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. భూముల గుర్తింపులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి రైతులు అవసరమైన పత్రాలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం, హక్కు పత్రాలు, నమోదు పత్రాలు, అనుబంధ పత్రాలు తదితర వివరాలను సంబంధిత అధికారులకు అందించాలని కోరారు. పత్రాల పరిశీలన పూర్తయిన తర్వాత ప్రక్రియను మరింత సులభంగా పూర్తి చేయవచ్చని వివరించారు. గ్రామసభలో పాల్గొన్న రైతులు భూ సమీకరణకు సంబంధించిన పలు సందేహాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటికి కలెక్టర్, సంబంధిత అధికారులు సమగ్ర వివరణ ఇచ్చారు. రైతుల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ భూ సమీకరణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ప్రతి దశలో రైతులకు పూర్తి సమాచారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, ఆర్.డి.ఓ శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, తహసీల్దార్ హరిబాబు, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అమరావతి అభివృద్ధికి అవసరమైన భూ సమీకరణ ప్రక్రియను పారదర్శకంగా, న్యాయబద్ధంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# స్వర్ణ గ్రామ కార్యాలయంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ప్రభుత్వ సేవల తీరుపై సమీక్ష
- అర్జీల పరిష్కార పురోగతిపై ఆరా
- సిబ్బంది పనితీరుపై అధికారులకు సూచనలు



**కాకినాడ,రాజధాని వాయిస్** : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కరప మండలం నడకుదురు గ్రామంలోని స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల నాణ్యత, కార్యాలయ నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలిస్తూ పలు అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో చేరుతున్నాయా లేదా అన్న విషయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. విధులకు హాజరైన ఉద్యోగుల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి సేవల అందుబాటు, సమస్యల పరిష్కారంలో ఎదురవుతున్న ఇబ్బందులపై సమాచారం సేకరించారు.వివిధ రకాల ధ్రువపత్రాల జారీ ప్రక్రియను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆదాయం, నివాసం, కులం తదితర ధ్రువపత్రాలు ఎంత వేగంగా జారీ చేస్తున్నారో తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఆలస్యం లేకుండా అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అనుకూల వాతావరణంలో సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నమోదైన పీజీఆర్ఎస్ అర్జీల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న వినతులు ఏవైనా ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, సమర్థత ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సేవలు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మృత జనసైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**అమలాపురం, రాజధాని వాయిస్** : జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో ప్రమాదవశాత్తూ మరణించిన జనసైనికుడు అడపా మల్లేష్ కుటుంబానికి జనసేన పార్టీ ఆర్థిక సహాయం అందించింది. పి. గన్నవరం నియోజకవర్గానికి చెందిన అడపా మల్లేష్ మృతి పట్ల పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబానికి అండగా నిలిచారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి చేతుల మీదుగా అడపా మల్లేష్ కుటుంబ సభ్యులకు రూ.4.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆర్థిక సహాయంలో అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు అనిశెట్టి స్వామి రూ.2.5 లక్షలు అందజేశారు. పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ రూ.1 లక్ష, అయినవిల్లి మండల అధ్యక్షుడు రాజేష్ పోలిశెట్టి రూ.50 వేల రూపాయలు, రామచంద్రాపురం నియోజకవ ర్గానికి చెందిన దేగల నాగేంద్ర రూ.50 వేల రూపాయలు అందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అడపా మల్లేష్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే కార్యకర్తగా గుర్తింపు పొందినట్లు నాయకులు పేర్కొన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి, కుటుంబానికి తీరని లోటని అన్నారు. కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాట్లా డిన నాయకులు మల్లేష్ కుటుంబానికి అవసరమైన ప్రతి విషయంలో సహకారం అందిస్తామని తెలిపారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం పట్ల జనసేన ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, కష్టకాలంలో వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అడపా మల్లేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు

**- కలెక్టర్ కృతిక శుక్ల**




**నరసరావుపేట అక్టోబర్ 07, రాజధాని వాయిస్:** కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధ్యక్షతన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ, జిల్లా అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ , ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలుపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు మరియు ఐవీఎఫ్ క్లినిక్‌లలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గర్భస్థ శిశువు యొక్క లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు లేదా భ్రూణ హత్యలను ప్రోత్సహించే సెంటర్ల లైసెన్సులను తక్షణమే రద్దు చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి స్కానింగ్ సెంటర్ వెలుపల లింగ నిర్ధారణ పరీక్షలు ఇక్కడ చేయబడవు నిషేధించబడ్డాయి అనే బోర్డును స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని, లేనిపక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గర్భవతులకు స్కానింగ్ చేసేటప్పుడు దానికి సంబంధించిన పూర్తి వివరాలను ఫారమ్-ఎఫ్ లో ఖచ్చితంగా నమోదు చేయాలని, ఈ రికార్డులను ఎప్పటికప్పుడు అధికారులు ఆడిట్ చేయాలని ఆదేశించారు.

**అవగాహన కార్యక్రమాలు:**

సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షను తగ్గించడానికి, లింగ నిష్పత్తిని మెరుగుపరచడానికి క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ద్వారా గర్భవతులు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రత్న మన్మోహన్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 188 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, అందులో గవర్నమెంట్ స్కానింగ్ సెంటర్లు 14, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లో 174 ఉన్నాయని తెలియజేశారు. వీటిలో నరసరావుపేట డివిజన్లో 123 స్కానింగ్ సెంటర్ల ఉండగా అందులో 7ప్రభుత్వ కానీ సెంటర్లో ,116 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ ఉన్నాయన్నారు. అలాగే గురజాల డివిజన్లో మొత్తం 43 ఉండగా అందులో నాలుగు ప్రభుత్వ, 39 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లో ఉన్నాయని, అలాగే సత్తెనపల్లి డివిజన్లో 22 స్కానింగ్ సెంటర్లో మూడు ప్రభుత్వ ,19 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ ఉన్నాయని కలెక్టర్ కి వివరించారు. జిల్లా సెక్స్ రేషియో 934 నమోదయినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లాస్ట్ మంత్ మండల డేటా ఎంతమంది మగ పిల్లలు, ఎంతమంది ఆడపిల్లలు జన్మించారో మండలాల వారీగా తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా డి ఎం అండ్ హెచ్ ఓ మాట్లాడుతూ మూడు కొత్త స్కానింగ్ సెంటర్లకు, 21 రెన్యువల్ కొరకు, 5 మాడిఫికేషన్ కొరకు , ఒకటి క్యాన్సిలేషన్ కొరకు స్కానింగ్ సెంటర్లు ప్రపోజల్స్ వచ్చాయని, ఎఆర్టి క్లినిక్ కి 3 ప్రపోజల్ వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె విజయలక్ష్మి,గైనకాలజిస్ట్ , బి లక్ష్మణ్ రావు పీడియాట్రిక్, డాక్టర్ టి రమాదేవి గైనకాలజిస్ట్ ఆర్ఎమ్ఓ ,ఏ. నీల కంటేశ్వరరావు ఎస్ ఓ, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమకుమార్, టి అశోక్ సి ఐ ,ఎన్జీవో శివకుమారి ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిరక్ష రాశ్యులలో అక్షర వెలుగులు నింపుదాం

## - ఎంపీడీఓ శ్రీనివాసరావు

**రాజుపాలెం.అక్టోబర్ 07, రాజధాని వాయిస్ :** మండలం లోని నిరక్షరాశ్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా అక్షర ఆంధ్ర ఫేస్-2 కార్యక్రమాన్ని ఒక ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఒక ఉద్యమంలా నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో అక్షరాంధ్ర పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఎంపీడీవో ఆధ్వర్యంలో నిరక్షరాశ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లెర్నర్స్ అటెండెన్స్ మార్కు చేసే విధానంపై సంబంధిత సిబ్బందికి వయోజన విద్య సూపర్వైజర్ సురేష్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అక్షరాంధ్ర పేజ్-2 రాజుపాలెం మండలంలో 3,746 మంది నిరక్షరాస్యులను అక్షరాశ్యులుగా మార్చటమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్యామ్, ఏపీఎం శివ కుమార్, ఏపీవో వెంకటేశ్వర్లు, సీసీలు,వివో ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# నూతన కానిస్టేబుళ్లు ప్రజాసేవలో ఆదర్శంగా నిలవాలి



**అనంతపురం, రాజధాని వాయిస్ :** పోలీసు శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయి విధుల్లో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ సూచించారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెంపొందేలా ప్రతి సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో నియమితులైన 279 మంది నూతన కానిస్టేబుళ్లకు నిర్వహించిన దిశానిర్దేశ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని పలు సూచనలు చేశారు. పోలీసు శాఖలో ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని వివరించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. నూతన కానిస్టేబుళ్లకు 45 రోజులపాటు క్షేత్రస్థాయి విధులతో పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో చట్టాలపై అవగాహన, నేరాల దర్యాప్తు విధానాలు, ప్రజలతో వ్యవహరించే పద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే తీరుపై సమగ్రంగా శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పోలీసు ఉద్యోగంలో అప్రమత్తత, నిజాయితీ, సేవాభావం అత్యంత ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి సంఘటనను బాధ్యతాయుతంగా తీసుకుని ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నేరాల నియంత్రణతో పాటు సామాజిక సమస్యల పరిష్కారంలో కూడా పోలీసుల పాత్ర కీలకమని వివరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే పోలీసులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు, ఆధునిక నేర పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని నూతన సిబ్బందికి సూచించారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న విషయాలను నిరంతరం అభ్యసిస్తూ తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పని చేయగల సామర్థ్యం ప్రతి పోలీసు సిబ్బందికి అవసరమని తెలిపారు. ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు బలమని పేర్కొన్న ఎస్పీ, నూతన కానిస్టేబుళ్లు విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థంగా వ్యవహరించడం ద్వారా సమాజంలో ఆదర్శ పోలీసులుగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, శిక్షణ సిబ్బంది, నూతన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాండ్ల సేకరణ కేంద్రాల ఏర్పాటు స్వాగతార్హం

**గుంటూరు, రాజధాని వాయిస్ అక్టోబర్ 7 :** ముఖ్యమంత్రి, మంత్రి వర్గ ఉప సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ డిపాజిట్దారుల బాండ్ల సేకరణ, ఫిక్సిడ్ డిపాజిట్స్, కొనుగోలు చేసిన స్థలాలు తదితర వివరాల సేకరణకు గాను ఉమ్మడి 13 జిల్లాలోనూ, విజయవాడ, కాకినాడ, తిరుపతి కలిపి మొత్తం 16 కేంద్రాలు ప్రారంభించాలని సీఐడీ విభాగం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 8 నుంచి కాక 9, 10 తేదీలలో ఆయా జిల్లాల్లో బాండ్ల సేకరణ ప్రారంభం కావచ్చని ఆయన తెలిపారు. దసరా ఉత్సవాల కారణం గా కర్ణాటక రాష్ట్రంలో 20వ తేది తరువాత బాండ్ల సేకరణ ప్రారం భం కానున్నదని ఆయన తెలిపారు. మన సీఐడీ చొరవతో తెలంగా ణ, ఒరిస్సా, అండమాన్, తమిళనాడు, చత్తీస్గడ్, మహారాష్ట్రలో కూడా ఆయా రాష్ట్రాల సీఐడీ విభాగాలతో చర్చించి బాండ్ల సేకరణ కేంద్రాలు ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఆయా ప్రభుత్వాలు కూడా తగిన శ్రద్ధ వహించి త్వరితగతిన మిగిలిన ఏడు రాష్ట్రాలలో బాండ్ల సేకరణ ప్రారంభించాలని కోరారు. ఈ మేరకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, సీఐడీ వారికి లేఖలు పంపుతున్నట్లు తెలిపారు.

# మలినేని కళాశాలలో ఏఐసీటీఈ-ఐడియా ల్యాబ్ ప్రారంభం!



**గుంటూరు, రాజధాని వాయిస్ :** విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలు, సమస్యా పరిష్కార సామర్థ్యం, నూతన ఆవిష్కరణలు మరియు వ్యాపార దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ--ఐడియా ల్యాబ్‌ను ఘనంగా ప్రారంభించారు. విద్యార్థుల ఆలోచనలకు ఆచరణ రూపం కల్పించి, వాటిని నమూనా ఉత్పత్తులుగా, తదుపరి దశలో సమాజానికి ఉపయోగ పడే వాణిజ్య ఉత్పత్తులు మరియు సేవలుగా అభివృద్ధి చేసేందుకు ఈ ల్యాబ్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ మల్లవరపు సూర్య తేజ, ఐఏఎస్, ఎండీ--ఏపిటీఎస్, సీఈఓ--ఏపీఐఎస్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (RTIH) హాజరయ్యారు. కళాశాల చైర్మన్ డా. మలినేని పెరుమాళ్లు, డైరెక్టర్ డా. కె. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా. జె. అప్పారావు, ఏఐసీటీఈ--ఐడియా ల్యాబ్ సమన్వయకర్త మరియు ఈసీఈ విభాగాధిపతి డా. డి. విజయ సారధి, వివిధ విభాగాల అధిపతులు, డీన్లు, అధ్యాపకులు మరియు విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శ్రీ మల్లవరపు సూర్య తేజ ఐఏఎస్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడు తూ, నేటి పోటీ ప్రపంచంలో కేవలం విద్యా పరిజ్ఞానం మాత్రమే కాకుండా సమస్యలను గుర్తించే దృష్టి, కొత్త ఆలోచనలు చేసే సామర్థ్యం, ఆ ఆలోచనలను ఆచరణలో పెట్టే నైపుణ్యం ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులకు వచ్చే ప్రతి కొత్త ఆలోచనను ఒక అవకాశంగా చూడాలని సూచించారు. ఒక సమస్యను గుర్తించిన తర్వాత దానికి వినూత్న పరిష్కారాన్ని ఆలోచించి, ఆ పరిష్కారాన్ని నమూనా రూపంలో తయారు చేసి, పరీక్షించి, మెరుగుపరచి చివరకు ప్రజలకు ఉపయోగపడే వాస్తవ ఉత్పత్తిగా ఎలా మార్చాలో వివరించారు. ఆలోచన నుంచి నమూనా, నమూనా నుంచి ఉత్పత్తి అనే ప్రయాణంలో విద్యార్థులు నిరంతరం ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, భవిష్యత్తులో ఉద్యోగాలను సృష్టించే వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మార్కెట్ అవసరాలను అర్థం చేసుకోవడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం, వాటికి తక్కువ వ్యయంతో సమర్థవంతమైన పరిష్కారాలను రూపొందించడం ద్వారా మంచి వ్యాపార ఆలోచనలకు పునాది వేయవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ సరికొత్త ఆలోచనలు మరియు ఆవిష్కరణలకు మేధో సంపత్తి హక్కులు, పేటెంట్లు పొందే విధానంపై కూడా ముఖ్య అతిథి అవగాహన కల్పించారు. ఒక మంచి ఆలోచనను అభివృద్ధి చేయడమే కాకుండా, దానికి తగిన మేధో సంపత్తి రక్షణ కల్పించడం కూడా ఎంతో ముఖ్యమని వివరించారు. అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (RTIH)ద్వారా విద్యార్థులు, యువ ఆవిష్కర్తలు మరియు స్టార్టప్‌లకు లభించే అవకాశాలను ఆయన వివరించారు. ఆలోచనలను ఆవిష్కరణలుగా అభివృద్ధి చేయడం నుంచి వాటిని తదుపరి దశకు తీసుకెళ్లే వరకు అవసరమైన మార్గదర్శకత్వం, నిపుణుల సహకారం, సాంకేతిక మద్దతు మరియు ఆవిష్కరణల అనుసంధానం వంటి అంశాల్లో ఇలాంటి ఆవిష్కరణల వేదికలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కళాశాల చైర్మన్ డా. మలినేని పెరుమాళ్ల మాట్లాడుతూ, మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల్లో సృజనాత్మకత మరియు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు నిరంతరం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. కళాశాలలో నిర్వహిస్తున్న హ్యాకథాన్‌లు, ప్రాజెక్ట్ పోటీలు, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు, బూట్‌క్యాంప్‌లు మరియు ఆవిష్కరణ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సమస్యలను గుర్తించి, బృందాలుగా పనిచేసి, సాంకేతిక పరిష్కారాలను రూపొందించే అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కళాశాలలో అభివృద్ధి చేస్తున్న ఆవిష్కరణల వాతావరణానికి ఏఐసీటీఈ--ఐడియా ల్యాబ్ మరింత బలాన్ని చేకూరుస్తుందని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని తమ ఆలోచనలను వాస్తవ ప్రాజెక్టులు, నమూనా ఉత్పత్తులు మరియు స్టార్టప్ ఆలోచనలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏఐసీటీఈ--ఐడియా ల్యాబ్ సమన్వయకర్త మరియు ఈసీఈ విభాగాధిపతి డా. డి. విజయ సారధి మాట్లాడుతూ, ఐడియా ల్యాబ్ ప్రధాన లక్ష్యం విద్యార్థులలోని ఆలోచనా శక్తిని వెలికితీసి, వాటికి ఆచరణాత్మక రూపం కల్పించడమేనని తెలిపారు. విద్యార్థులు సమస్యను గుర్తించడం, ఆలోచనను రూపొందించడం, రూపకల్పన చేయడం, నమూనాను తయారు చేయడం, పరీక్షించడం మరియు తుది ఉత్పత్తిని అభివృద్ధి చేయడం వంటి ప్రతి దశలో ఐడియా ల్యాబ్‌ను వినియోగించుకోవచ్చని వివరించారు. ల్యాబ్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక పరికరాలు మరియు సాంకేతిక వనరుల సహాయంతో విద్యార్థులు తమ ప్రాజెక్టులకు అవసరమైన నమూనాలను తయారు చేసుకోవచ్చని తెలిపారు. చూసి నేర్చుకోవడం కంటే చేసి నేర్చుకోవడం అనే విధానానికి ఐడియా ల్యాబ్ ద్వారా ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డా. కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా కొత్త సాంకేతికతలను అన్వేషించాలని సూచించారు. ఏఐసీటీఈ--ఐడియా ల్యాబ్ విద్యార్థులకు తమ ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరీక్షించుకునేందుకు, కొత్త నమూనాలను రూపొందించేందుకు, బృందాలుగా పనిచేసేందుకు మరియు సమస్యలకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. అప్పారావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో నూతన ఆలోచనలు మరియు పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ఏఐసీటీఈ--ఐడియా ల్యాబ్‌ను విద్యార్థులు కేవలం ఒక ప్రయోగశాలగా కాకుండా తమ ఆలోచనలకు ప్రయోగ వేదికగా, కొత్త ఉత్పత్తుల రూపకల్పనకు కేంద్రంగా మరియు భవిష్యత్ వ్యాపార ఆలోచనలకు ప్రారంభ బిందువుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, డీన్లు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ముఖ్య అతిథి మరియు ఇతర ప్రముఖులు ఏఐసీటీఈ--ఐడియా ల్యాబ్‌లోని సాంకేతిక సదుపాయాలను పరిశీలించారువిద్యార్థుల ఆలోచనలకు ఆచరణ రూపం -- ఆవిష్కరణలకు ప్రోత్సాహం -- నమూనా ఉత్పత్తుల అభివృద్ధికి వేదిక -- భవిష్యత్ వ్యాపారవేత్తలకు మార్గ దర్శకం... ఏఐసీటీఈ--ఐడియా ల్యాబ్ ద్వారా మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవిష్కరణల దిశగా మరో ముందడుగు వేసింది.

# బాల కార్మికులు కనిపిస్తే చర్యలు ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కామాక్షి నగర్ మిర్చియార్డు పరిసర ప్రాంతాల్లో బాల కార్మికులను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. మిర్చి గోడౌన్లు, పాకల్లో బాల కార్మికులు కనిపిస్తే గోడౌన్ యజమానులు, మేస్త్రీలు, తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 25వ డివిజన్ కామాక్షి నగర్‌లో బుధవారం మిర్చి తొడిమల గోడౌన్లలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, మేస్త్రీలు, గోడౌన్ యజమానులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ... చిన్నారులను పనులకు వినియోగించడం శిక్షార్హమైన నేరమని అన్నారు. పిల్లలను పనులకు తీసుకురావడాన్ని గోడౌన్ యజమానులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారిని చదువుల వైపు మళ్లించాలని కోరారు. చిన్న వయసులోనే పనులకు అలవాటు చేయడం వల్ల వారు విద్యకు దూరమై భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని చెప్పారు.

**ఒక ఏడాది పాటు ప్రత్యేక పర్యవేక్షణ**

కామాక్షి నగర్ మిర్చియార్డు ప్రాంతంలో వచ్చే ఏడాది పాటు చైల్డ్ లేబర్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పిల్లలను పనులకు పంపించే తల్లిదండ్రులు, అవకాశం కల్పించే గోడౌన్ యజమానులు, మేస్త్రీలపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అంశంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**సీజనల్ హాస్టళ్లను సమర్థంగా నిర్వహించాలి**

ఒడిశా నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలు చదువులకు దూరం కాకుండా సీజనల్ హాస్టళ్లు, విద్యా సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సీజనల్ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, అర్హులైన పిల్లలందరికీ వసతి, విద్యా అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**శానిటేషన్‌పై రాజీ లేదు**

మిర్చి తొడిమల వ్యర్థాలను గోడౌన్ ప్రాంగణాల వెలుపల పడేయడం వల్ల శానిటేషన్ సమస్యలు తీవ్రమవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తొడిమలు, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా తగిన విధంగా నిర్వహించాలని సూచించారు. వ్యర్థాలను కాల్చడం వల్ల కాలుష్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శానిటేషన్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

**కార్మికులకు మరుగుదొడ్లు తప్పనిసరి**గోడౌన్లలో పనిచేసే కార్మికులకు, ముఖ్యంగా మహిళలకు తగిన మరుగుదొడ్ల సదుపాయం కల్పించాల్సిన బాధ్యత యజమానులదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్మికుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి గోడౌన్‌లో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని కోరారు.

# గుంటూరు జిల్లా పోలీసు నూతన లోగో ఆవిష్కరణ!

**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లాలోని ఆరు సబ్‌డివిజన్ల డీఎస్పీలు మహిళ పీస్ డీస్పీ, సీసీఎస్ డీస్పీ లతో కలిసి గుంటూరు జిల్లా పోలీసు లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ఇకపై జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఈ లోగోను ధరించాలని సూచించారు. ఈ లోగో గుంటూరు జిల్లా పోలీసులకు ప్రత్యేక గుర్తింపును కల్పించడంతో పాటు, ప్రజల్లో జిల్లా పోలీసు వ్యవస్థపై అవగాహనను పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. గుంటూరు జిల్లాకు ప్రత్యేకమైన పోలీసు లోగోను ఆవిష్కరించడం ఆనందంగా ఉందని ఎస్పీ మరియు డీఎస్పీలు పేర్కొన్నారు.



PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com